క్లుప్తంగా

ఎన్‌ఏడీ సీజీఎంతో శ్రీధర్ భేటీ



సీజీఎంను సత్కరిస్తున్న డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్

విశాఖ విద్య: నేవల్ ఆర్మమెంట్ డిపో చీఫ్ జనరల్ మేనేజర్ దివాకర్ జయంత్‌తో బుధవారం డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ భేటీ అయ్యారు. ఇటీవల పదవీ బాధ్యతలు స్వీకరించిన దివాకర్ జయంత్‌ను ఆయన కార్యాలయంలో కలిసి శాలువతో సత్కరించి సింహాద్రి అప్పన్న చిత్రపటాన్ని అందించారు. విశాఖ నగరంలో ఎన్ఏడీతో సంబంధం ఉన్న ప్రాంతాలు.. అక్కడ సమస్యల గురించి చర్చించారు.

అంగన్‌వాడీలో 'ఈసీసీఈ- డే'



పిల్లల బరువును పరీక్షిస్తున్న టీచర్ విజయలక్ష్మి

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు కంచరపాలెం దరి గొల్లకంచరపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో ఎర్లీ చైల్డ్ కేర్ ఎడ్యుకేషన్(ఈసీసీఈ)-'డే' కార్యక్రమాన్ని అంగన్‌వాడీ టీచర్ టి.విజయలక్ష్మి నేతృత్వంలో బుధవారం నిర్వహించారు. పిల్లల వికాసం, పెరుగుదల, పర్యవేక్షణ అంశాలపై పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అనంతరం పిల్లల బరువులు, సామర్థ్యాలను పరీక్షించారు. కార్యక్రమంలో ఆయా కుమారి, పలువురు తల్లులు, కంచరపాలెం ప్రాథమిక పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

గోపాలపట్నం: శ్రీవరాహ లక్ష్మీనరసింహ పెట్రోల్ బంక్ వర్తక సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా కోనేటి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా దార్ల సూరిబాబు, కార్యదర్శిగా తెంటు రామ్ కుమార్, కోశాధికారిగా పిల్ల వెంకటేష్‌తో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ మేరకు వారు బుధవారం ఎమ్మెల్యే గణబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన నూతన కార్యవర్గాన్ని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

కార్మిక చట్టాలకు కేంద్రం తూట్లు

గోపాలపట్నం: యజమానులకు అనుకూలంగా కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను మార్చుతోందని సీఐటీయూ నాయకులు ఆరోపించారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో కార్మికులకు అన్యాయం చేస్తోందని మండిపడ్డారు. కేంద్ర విధానాలను నిరసిస్తూ బుధవారం గోపాలపట్నం బంక్ జంక్షన్ వద్ద నిరసన చేపట్టారు. ప్రస్తుతం ఉన్న చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్చి కంపెనీ యజమానులకు అనుకూలంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు అనసూయ, బలివాడ వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

రాజారావుకు నివాళి

సింథియా: జీవీఎంసీ 63వ వార్డు చింతల్లోవలో టీడీపీ నాయకుడు స్వర్గీయ పుక్కళ్ల రాజారావు చిత్రపటానికి ఎమ్మెల్యే గణబాబు నివాళులర్పించారు. రాజారావు పెద్దకర్మను బుధవారం నిర్వహించారు. వార్డు కార్పొరేటర్ గల్లా చిన్నా, నాయకులు జెర్రిపోతుల నర్సింగరావు, గూడెల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన కవి సమ్మేళనం

సీతంపేట : సహృదయసాహితి ఆధ్వర్యంలో స్థానిక ప్రిజమ్ కళాశాలలో బుధవారం జరిగిన కవి సమ్మేళనం వైవిధ్యభరితమైన కవితలతో అందరినీ అలరించింది. సభాధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ కవిత్వానికి వస్తువు, అభివ్యక్తి రెండూ ముఖ్యమని, అలంకారం కావ్య సౌందర్యానికి శోభనిస్తుందన్నారు. భావాన్ని స్పష్టంగా, చమత్కారంగా చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. కె.జి.వేణు మాట్లాడుతూ కవిత్వం నిత్య నూతనంగా ఉండాలని, కవి సమాజ శ్రేయోభిలాషి అన్నారు. ఈ సందర్భంగా నటుడు, నాటకకర్త రావి కొండలరావు సాహిత్య విశేషాలను వివరించారు.

ఆహ్లాదం.. ఆనందం.. ఆరోగ్యం C/o చిల్డ్రన్ పార్కు

పిచ్చి మొక్కలు.. పిక్క తేలిన మార్గాలు.. వెరసి కళా విహీనంగా మారిన ఆ పార్కును గత ప్రభుత్వం అభివృద్ధి చేసింది. ఆహ్లాదానికి కేరాఫ్‌గా నిలిపింది. దీంతో చిన్నా పెద్దా అన్న తేడా లేకుండా గుల్లలపాలెం వుడాపార్కుకు క్యూ కడుతున్నారు. పిల్లలు ఆటలతో, పెద్దలు వ్యాయామంతో పాటు హాయిగా కాలక్షేపం చేస్తూ ఆనందంగా గడిపి ఆరోగ్యంగా ఉంటున్నారు.



ఆట పరికరాలు



మినీ రంగులరాట్నం వద్ద చిన్నారులు



పార్కులో చిన్నారుల సందడి

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం వుడాకాలనీ పార్కును పారిశ్రామిక ప్రాంతంలోని పార్కుల్లో నంబర్ వన్ స్థానంలో నిలిచే విధంగా తీర్చిదిద్దారు. సుమారు మూడువేల రకాల మొక్కలు నాటారు. పిల్లలకు ఆట పరికరాలు,పెద్దల కోసం వాకింగ్ ట్రాక్, కాలక్షేపం కోసం బల్లలు, శుభ్రమైన మరుగుదొడ్లు,మంచినీటి సౌకర్యం కల్పించారు. సుమారు 550 నివాసాలు ఉన్నాయి. వీటిలో సుమారు రెండు వేల మంది వరకు నివాసం ఉంటున్నారు. అయితే వీరి కోసం నాడు సుమారు 75 సెంట్ల విస్తీర్ణంలో పార్కు ఏర్పాటు చేశారు. అయితే దీని ఆలనా పాలనా చూసే నాథుడు లేకపోవడంతో ఆ పార్కు కళావిహీనంగా మారింది. ఈ క్రమంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా వచ్చిన వైఎస్సార్‌సీపీ నాయకులతో పాటు వార్డు కార్పొరేటర్ పి.వి.సురేష్ దృష్టికి కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు సమస్యను తీసుకువెళ్లారు. దీంతో వారు స్పందించి హెచ్‌పీసీఎల్,జీవీఎంసీ అధికారులతో మాట్లాడి సుమారు రూ. 50లక్షలతో పార్కును ఆధునికీకరించే విధంగా చర్యలు తీసుకున్నారు.

- రూ.50 లక్షలతో పార్కు ఆధునికీకరణ
- గత ప్రభుత్వంలో అభివృద్ధి
- ఉత్సాహంగా గడుపుతున్న వుడాకాలనీ వాసులు

పార్కులో కల్పించిన వసతులు

- పార్కు చుట్టూ సుమారు 3 వేల వివిధ రకాల మొక్కలు నాటారు
- చిన్నపిల్లలు ఆడుకునేందుకు అధునాతన ఆట పరికరాలు
- పెద్దలు వాకింగ్ చేయడానికి వీలుగా 500 మీటర్ల వాకింగ్ ట్రాక్
- సాయంత్రం వేళ కాలక్షేపం చేయడానికి విశాలమైన బల్లలు,రచ్చబండ
- మరుగుదొడ్లు, మంచినీటి సౌకర్యం
- పార్కులోకి పశువులు చొరబడకుండా రక్షణ గేట్లు
- పార్కును 24 గంటలు పర్యవేక్షించేందుకు ప్రత్యేకమైన టీమ్ ఏర్పాటు



సుందరంగా ఉన్న చిల్డ్రన్ పార్కు

నిత్యం కళకళ

ఈ పార్కు నిత్యం కళకళలాడుతోంది. ఉదయం 6 నుంచి 9 గంటల వరకు,మరలా సాయంత్రం 5 నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రవేశం ఉంటుంది. కాలనీ వాసులు వాకింగ్ చేస్తూ ఉత్సాహంగా గడుపుతుంటే.. చిన్నారులు ఇక్కడ ఆట పరికరాలతో ఆడుకుంటూ చాలా సంతోషంగా గడుపుతున్నారు.

హామీ నిలబెట్టుకున్నా..



నా ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇక్కడ కాలనీ వాసులకు పార్కును ఆధునికీకరించి చూపిస్తా అని హామీ ఇచ్చాను. ఆ హామీ మేర మా పార్టీ ముఖ్య నేతలు,జీవీఎంసీ,హెచ్‌పీసీఎల్ ఉన్నతాధికారుల సహకారంతో పార్కును రూ. 50లక్షలతో ఆధునికీకరించాం. పిల్లలు, పెద్దలు అందరూ ఉల్లాసంగా గడిపేలా వసతులు కల్పించాం.

-పి.వి.సురేష్, వార్డు కార్పొరేటర్

సంతోషంగా ఉంది



మా కాలనీలో ఇంత సుందరమైన పార్కు నిర్మాణం చేయడం చాలా సంతోషంగా ఉంది. దీనికి సహకరించిన పాలకులు,జీవీఎంసీ అధికారులకు కృతజ్ఞతలు. అంధవికారంగా ఉన్న పార్కును సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.

- కె.బంగారురాజు, వుడాకాలనీ గౌరవ అధ్యక్షుడు

సకలు వసతులు కల్పించారు



ఇంతటి విశాలమైన ప్రదేశంలో పార్కును చూడ ముచ్చగా తీర్చిదిద్దారు. పచ్చటి మొక్కలతో చిల్డ్రన్ పార్కును అభివృద్ధి చేయడం చాలా ఆనందంగా ఉంది. ఈ పార్కు నిర్మాణం కోసం అసోసియేషన్ తరపున చాలా శ్రమించాం. చివరకు మంచి ఫలితం లభించింది. అంతా ఆనందంగా గడుపుతున్నాం.

- రాజేష్, వుడాకాలనీ కోశాధికారి

చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



మాట్లాడుతున్న సూపర్ వైజర్ వరలక్ష్మి

విశాఖ విద్య: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ వరలక్ష్మి సూచించారు. జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. చిన్నారులు, వారి తల్లిదండ్రులు, గర్భిణులకు ఆరోగ్యపరమైన అంశాలపై అవగాహన కల్పించారు. సూపర్ వైజర్ వరలక్ష్మి మాట్లాడుతూ అంగన్‌వాడీల ద్వారా అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కేంద్రాలకు వచ్చే పిల్లలు ఆరోగ్యవంతంగా ఉన్నప్పుడే ఎదుగుదల ఉంటుందన్నారు. వయసు మేరకు ఎంత బరువు ఉండాలి, ఎంత ఎత్తు ఉండాలనే దానిపై ప్రతీ తల్లిదండ్రులు తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో ప్రతీ నెల క్రమం తప్పకుండా పిల్లల బరువు, ఎత్తు నమోదు చేసి ఆన్‌లైన్ ద్వారా రికార్డుల్లో పొందుపరుస్తారన్నారు. వీటిని చిన్నారుల తల్లిదండ్రులు పరిశీలించుకోవచ్చన్నారు. సమావేశంలో వైద్య ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలకు స్పందన



ఎంపికైన విద్యార్థులతో కళాశాల ప్రిన్సిపాల్ ప్రదీప్ తదితరులు

గోపాలపట్నం: జీవీఎంసీ 88వ వార్డు నరవలోని విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో బుధవారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. (24)7.ఏఐ సంస్థ ఆధ్వర్యంలో డిప్లమో, ఇంజినీరింగ్ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు డ్రైవ్‌లో పాల్గొన్నారు. కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగానికి చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. వీరికి వార్షిక వేతనం రూ.3.5 లక్షలు ఉంటుందని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ జీవీ ప్రదీప్, కంపెనీ ప్రతినిధులు అభినందించారు.

అనిల్‌కుమార్‌ను అభినందించిన వాసుపల్లి



అనిల్‌కుమార్‌ను అభినందిస్తున్న మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

మల్కాపురం: వైఎస్సార్‌ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన అనిల్‌కుమార్ బుధవారం మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్‌ను వాసుపల్లి సత్కరించారు. కార్మికులకు అండగా పోరాటాలు చేయాలని.. తమ మద్దతు ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పీవీ సురేష్, పార్టీ ఎస్సీ సెల్ సెక్రటరీ గుంట సుందర్‌రావు,బుజ్జి,రమేష్ తదితరులు ఉన్నారు. అనంతరం అనిల్‌కుమార్ ఉత్తర నియోజక వర్గ పార్టీ సమన్వయకర్త కె.కె.రాజును మర్యాదపూర్వకంగా కలిశారు.

చిల్డ్రన్ పార్కును సందర్శించిన జెడ్సీ



పార్కు నిర్వహణపై సూచనలిస్తున్న జోన్-5 జెడ్సీ రాము

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం వుడాకాలనీలోని చిల్డ్రన్ పార్కును జోన్-5 జెడ్సీ రాము బుధవారం సందర్శించారు.వార్డు పర్యటనలో భాగంగా చిల్డ్రన్ పార్కుకు వచ్చిన జెడ్సీ నిర్వహణ గురించి నిర్వాహకులు బంగారురాజును అడిగి తెలుసుకున్నారు. పార్కులో గార్డెన్,విద్యుత్ లైట్లు, వాకర్స్‌కు కల్పించిన వసతులు చూసి ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా.. చక్కని వాతావరణంలో పార్కు నిర్వహణ చేయాలని సూచించారు. ఆయన వెంట జోన్-5 పరిధిలోని వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది ఉన్నారు.

కార్మికులపై కక్ష సాధింపు చర్యలు తగవు



హెచ్‌పీసీఎల్ లేబర్ గేటు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న అఖిలపక్ష కార్మిక నాయకులు

మల్కాపురం: కార్మికులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం సమంజసం కాదని అఖిల పక్ష కార్మిక సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. లేబర్ కోడ్స్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ హెచ్‌పీసీఎల్ లేబర్ గేటు వద్ద అఖిల పక్ష కార్మిక సంఘ నాయకుల ఆధ్వర్యంలో బుధవారం నిరసన చేపట్టారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి భోగవల్లి నాగభూషణం, సీఐటీయూ నగర నాయకులు ఆర్.లక్ష్మణమూర్తి మాట్లాడుతూ పలు ప్రైవేట్, ప్రభుత్వ రంగ పరిశ్రమల్లో పని చేస్తున్న కార్మికులకు కనీస వసతులు ,కనీస వేతనాలు చెల్లించడం లేదన్నారు. ప్రతి కాంట్రాక్ట్ కార్మికుడికి నెలకు కనీసం రూ. 26 వేల వేతనం చెల్లించేలా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని,అలాగే ప్లాంట్ పరిరక్షణ కోసం కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు యత్నించాలని డిమాండ్ చేశారు. నిధులు కేటాయించినంత మాత్రాన స్టీల్‌ప్లాంట్‌ను సంరక్షించినట్టు కాదని, సొంత గనులు కేటాయించిన నాడే ఆ పరిశ్రమను కాపాడిన వారు అవుతారన్నారు. కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



షిప్‌యార్డ్ మెయిన్‌గేటు వద్ద నిరసన తెలుపుతున్న అఖిల పక్ష కార్మిక సంఘాల నాయకులు

లేబర్ కోడ్‌లను వ్యతిరేకిస్తూ నిరసన

సింథియా: లేబర్ కోడ్‌లను వ్యతిరేకిస్తూ దేశ వ్యాప్తంగా కార్మికులు చేపట్టిన నిరసన కార్యక్రమంలో భాగంగా సీఐటీయూ పిలుపు మేరకు బుధవారం హిందూస్థాన్ షిప్‌యార్డ్ మెయిన్‌గేటు వద్ద అఖిల పక్ష కార్మిక సంఘాల నాయకులు నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నాలుగు లేబర్‌కోడ్‌ల వల్ల కార్మికులు తీవ్రంగా నష్టపోతారని, పాత 29 చట్టాలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. 30 ఏళ్లుగా పనిచేస్తున్న ఎల్ అండ్ ఎం సీరిస్ కార్మికులకు వెంటనే పర్మినెంట్ చేయాలని కోరారు. నిరసన కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ, టీఎన్‌టీయూసీ, సీఐటీయూ, వైఎస్సార్‌టీయూసీ, ఏఐటీయూసీ, జనసేన ట్రేడ్ యూనియన్, టీఎన్ఈటీయూ, హెచ్ఎంఎస్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలలపై పర్యవేక్షణ కరువు!

మండలంలోని ప్రభుత్వ స్కూళ్లు	38
చదువుతున్న విద్యార్థులు	8,800

- రుచిలేని మధ్యాహ్న భోజనం
- గోపాలపట్నం మండలంలో బినామీ ఏజెన్సీలు
- ఇళ్ల నుంచే క్యారేజీలు తెచ్చుకుంటున్న విద్యార్థులు



గోపాలపట్నం జెడ్పీ హైస్కూల్లో ఇళ్ల నుంచి తెచ్చుకున్న క్యారేజీల్లో భోజనం తింటున్న విద్యార్థినులు

విశాఖ విద్య: గోపాలపట్నం మండలంలోని ప్రభుత్వ పాఠశాలలపై పర్యవేక్షణ కొరవడింది. మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ గాడితప్పింది. మండలంలోని హెచ్‌సీ వెంకటాపురం జెడ్పీ హైస్కూల్లో చోటుచేసుకున్న ఘటన విద్యాశాఖాధికారుల పర్యవేక్షణ లేమికి నిదర్శనంగా నిలుస్తోంది.

కూటమి నేతల ఒత్తిళ్లతో బినామీ ఏజెన్సీలు

కూటమి నేతల ఒత్తిళ్లతో ఏళ్ల తరబడి మధ్యాహ్న భోజనం పథకం నిర్వహించే ఏజెన్సీలను తప్పించి, వారి స్థానంలో బినామీలకు అప్పగిస్తున్నారనే ప్రచారం సాగుతోంది. హెచ్‌సీ వెంకటాపురం జెడ్పీ హైస్కూల్లో వంట ఏజెన్సీ ఎవరు నిర్వహిస్తున్నారో అధికారులు పరిశీలన చేస్తే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

ఇళ్ల నుంచే క్యారేజీలు

మెనూ మేరకు రుచికరమైన భోజనం వండిపెట్టకపోవడంతో పాటు పరిశుభ్రమైన వాతావరణం లేకపోవడంతో చాలా మంది విద్యార్థులు బడిలో భోజనం తినేందుకు ఆసక్తి చూపడం లేదు. గుడ్లు కుళ్లి కంపుకొడుతుండటంతో వాటిని తినేందుకు విద్యార్థులు ఆసక్తి చూపడం లేదు. దీంతో పలువురు విద్యార్థులు ఇళ్ల నుంచే క్యారేజీలు తెచ్చుకుంటున్నారు. మండలంలో ప్రతీ స్కూల్లో ఇలాంటి దృశ్యాలే కనిపిస్తున్నాయి. క్యారేజీలు తెచ్చుకుంటున్న తింటున్న విద్యార్థులకు సంబంధించిన భోజనం సరకులు ఎటుపోతున్నాయనేది ఉన్నతాధికారుల పరిశీలన చేస్తే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని విద్యార్థి సంఘాల వారు అంటున్నారు.

అదనపు విధులతో భారం

ప్రభుత్వ స్కూళ్లను బలోపేతం చేసే క్రమంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మండలానికి ఇద్దరు ఎంఈవోలను ఏర్పాటు చేసింది. అయితే ఇక్కడి ఎంఈవో సోమేశ్వరరావుకు డిప్యూటీ డీఈవోగా అదనపు బాధ్యతలు అప్పగించారు. దీంతో ఎంఈవో-2 దివాకర్ పైనే పాఠశాలల పర్యవేక్షణ భారమం పడుతోంది. గోపాలపట్నం మండలంలో ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలో 38 పాఠశాలలు ఉండగా, వీటిలో సుమారుగా 8, 800 మంది విద్యార్థులు చదువుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ప్రభుత్వ పాఠశాలల్లో చదువులు అస్తవ్యస్తంగా సాగుతున్నాయి.

ప్రైవేటు వైపే మొగ్గు

గోపాలపట్నం మండలంలో ప్రైవేటు స్కూళ్లు 103 వరకు ఉన్నాయి. ఇక్కడ సుమారు 33 వేల మంది విద్యార్థులు ఉన్నారు. ప్రభుత్వ స్కూళ్ల కంటే ప్రైవేటు స్కూళ్లలో విద్యార్థులు నాలుగింతలు ఎక్కువగా ఉండడం గమనార్హం. దీంతో ఇక్కడి విద్యాశాఖాధికారులు ప్రైవేటు స్కూళ్ల గుర్తింపు, వాటి రెన్యువల్ వంటి వ్యవహారాలకే పెద్ద పీట వేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. మర్రిపాలెం జ్యోతినగర్ జీవీఎంసీ స్కూల్లో మండల వనరుల కేంద్రం(ఎమ్మార్సీ) ఏర్పాటు చేశారు. ఒకరిద్దరు సీఆర్పీలు షాడో అధికారులుగా అవతారమెత్తి తనిఖీల పేరిట వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

పర్యవేక్షణ పెంచుతాం

ప్రభుత్వ పాఠశాలలపై పర్యవేక్షణ చేస్తున్నాం. హెచ్‌సీ.వెంకటాపురం స్కూల్లో విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయంపై పూర్తి స్థాయిలో వివరాలు తెలుసుకుంటున్నాం. గుర్తించిన వంట ఏజెన్సీలు మాత్రమే భోజనం వండిపెట్టాలి. ఎక్కడైనా వేరే వ్యక్తులు వంట చేస్తున్నట్లు తేలితేచర్యలు తీసుకుంటాం.

– దివాకర్, ఎంఈవో-2

ఇమ్యునైజేషన్ కార్యక్రమంపై డీఎంహెచ్‌వో ఆరా



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట : స్వర్ణ భారతి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ) పరిధిలో ఉండే హరిజన వీధి సచివాలయాన్ని బుధవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు సందర్శించారు. అక్కడ జరుగుతున్న ఇమ్యునైజేషన్ కార్యక్రమంపై ఆయన సమీక్షించారు. అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు, ఓపీ, ఐపీ, డయాగ్నొస్టిక్ సేవలు, మందుల లభ్యత, ఎన్‌సీడీ 3.0 సర్వే తదితర అంశాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మెడికల్ అధికారులు, సిబ్బందికి కాంప్రహెన్సివ్ స్క్రీనింగ్, రిఫరల్ సేవలపై పూర్తిగా విశదీకరించారు. అభ ఐడీ, మ్యాపింగ్ శతశాతం సాధించాలని వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బందికి ఆదేశించారు. పట్టణ ఆరోగ్య కేంద్ర వైద్యులు డాక్టర్ రవి శంకర్, పలు విభాగాల అధికారులు, ఇతర ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.